# ఈ కథ ప్రచురించవద్దు!




'ఒరేయ్! నాయనా! కాస్త స్వప్నలోకం లోంచి ఉన్న లోకంలోకి ఊడిపడరా!' అంటూ వగరుస్తూ వచ్చిన వాసును చూడగానే రాస్తున్న కథను ఆపేసి తలెత్తి చూశాను.

ముఖమ్మీదికిపడుతున్నజుట్టు, రోషంతో ఎగిరెగిరిపడుతున్న ముక్కుపుటాలు, అవమానంతో రంగులు మార్చుకున్న దిక్కులన్నీ కోపాగ్నితో కాలిపోతున్న కళ్ళు వాసుగాడి వాలకం. అందరికీ అర్థమయ్యే సినిమాభాషలో చెప్పాలంటే, హీరోయిన్ చేత పరాభవింపబడినప్పుడు రాజనాల వదనం ఎలావుంటుందో అలావుంది వాసు గాడి వాలకం.

'ఇప్పుడేం కొంప మునిగిందిరా బాబూ!' అంటూ కుర్చీలోంచి లేచాను.

'కొంప మునగటంకాదురా నాయనా! నా పరువే గంగలో మునిగిపోయింది' అంటూ నీరు కారిపోతూ కుర్చీలో కూలబడ్డాడు.

అప్పటివరకూ కథాగమనంలో లీనమైన నా మనస్సుకు వాడి ఆందోళన అర్థంకాలేదు.

'ఒరేయ్! నా ప్రాణం తీయక విషయమేమిటో వివరించరా?'

'నీలాంటివాడికి చెప్పినా ఒకటే ఆ నిర్జీవమైన గోడకు చెప్పినా ఒకటే! అయినా అడిగావు కనుక చెప్తున్నాను. ఆదరిస్తావో, అసహ్యించుకుంటావో అంతా నీ ఇష్టం! అక్కడ...అదే ఆనందానికి అగ్రస్థానమైన మన ఆఫీసులో, అంత మందిలో ఒక అబలచేత అవమానంపొందిన ఈ అసమర్థుడు 'ఆత్మహత్య చేసుకోవాల్సిన అగత్యం ఏర్పడినదంటే' నీవు నమ్ముతావా?'

వాడిమాటల్ని వెంటనే అర్థం చేసుకోలేకపోయాను. ఆఫీసంటున్నాడు, అబలంటున్నాడు, అవమానమంటున్నాడు...ఏమిటో? ఆడపిల్లల్ని ఎలా ఏడ్పించాలి అన్న విషయమ్మీద పి.హెచ్.డి. చేసి స్కాలర్ అనిపించుకుంటున్న వాసు అబలచేత అవమానింపబడటమా?

అర్థంకాని ప్రశ్నతో అలమటిస్తున్న నా మనస్సుకు మరింత పని కల్పించకుండానే వాసుగాడు చెప్పేశాడు. 'మన టైపిస్టు నాగమణి నన్ను నల్గురితో

నవ్వులపాలు చేసిందిరా!'

నేను నమ్మలేకపోయాను ఎందుకంటే నాగమణిని మావాడు ఎప్పుడూ ఏదో మాటలని ఏడిపిస్తాడన్నవిషయం అందరికీ తెల్సు!

'వీడు నాపాలిట యమునిలా తగలడ్డాడే!' అని రోజూ స్వగతంగా అనుకునే నాగమణి ఈవేళ వాసుగణ్ణి అవమానించినదంటే నమ్మటం విషయం ఎలావున్నా ఆ హఠాత్సంఘటనకు నా పెదాలమీద చిరునవ్వు చిందులాడింది.

'అంతేలేరా! మీరంతా మిత్రద్రోహులు! నువ్వేకాదు! మన డిపార్టుమెంట్లో పక్షులన్నీకూడా అలాగే పళ్ళికిలించాయి. నేనో ప్రక్క అవమానంతో కృంగిపోతుంటే, మీరు కులాసాగా నవ్వుతున్నారా?'

'దానిక్కాదురా నేను నవ్వేది! విధి విధానానికి నవ్వొచ్చింది! కాకపోతే నాగమణిపాలిట విలన్‌లా తయారైన నీకు అవమానమేమిట్రా?'

'అదే బ్రదర్! అనుకోని అఘాతం తగలగానే నేను కూడా కొయ్యబారి బదులు చెప్పలేకపోయాను. గతంలో ఎన్నోసార్లు ఎన్నో పర్సనల్ అప్లికేషన్లు టైప్ చేయించాను. కాని ఎన్నడూ నేటిలా జరుగలేదు!'

'ఇంతకీ అసలేమైందో చెప్పరా!' అని ఆతృతతో అడిగాను.

'ఈ వేళ సాయంత్రం నాల్గు గంటలకు మన ఆఫీసరు వాళ్ళ బావమరిది ఎవడో వస్తే మ్యాట్నీకి చెక్కేశాడు. ఆ ముసలాడు అటు పోగానే మన డిపార్టుమెంట్లో పక్షులన్నీ రెక్కలు దులుపుకుని సీట్లు వదిలి బాతాఖానీకి దిగాయి. నేను కూడా అందరిలాగానే దుకాణం సర్దేసి కుర్చీలోంచి లేచేసరికి టేబిల్ మీదున్న కవరు నా వైపు జాలిగా చూసింది. గబ గబా అందులోవున్న కాగితాల్ని తీసుకుని నాగమణి సీటు దగ్గరకు బయల్దేరాను. ఇంతకీ ఆ కాగితాలేమిటో చెప్పటం మర్చాను. మా తమ్ముడు ఏదో బ్యాంకుకు అప్లై చేస్తున్నాడంటే బయట టైపు చేయిస్తే అనవసరంగా అర్ధరూపాయి దండగవుతుందని ఆఫీసుకు తెచ్చాను. నాగమణికి లీజర్‌గా వున్నప్పుడు టైప్ చేయించవచ్చునని టేబిల్‌మీద పెట్టాను. నేను ఆమె దగ్గర కెళ్ళేసరికి ఏదో డిటెక్టివ్‌నవల చదువుతూంది. నా దగ్గు విన్పించగానే తలెత్తింది. ముందు నా ముఖం వైపు, తర్వాత నా చేతిలోవున్న కాగితాలవైపు, ఆ తర్వాత ఆమె చదువుతున్న నవలలోని పేజీలవైపు శరవేగంతో పరిగెత్తాయి ఆమె చూపులు. అంతులేని నిర్లక్ష్యం చూపిస్తున్న నాగమణి ప్రవర్తన నాకు విపరీతమైన ఆశ్చర్యాన్ని అంతకుమించిన కోపాన్ని కల్గించాయి. చుట్టుప్రక్కల మనవాళ్ళెవరైనా నన్ను గమనిస్తున్నారేమోనని చూసేసరికి వాళ్ళయిదు జతల కళ్ళు ఏదో సినిమాలో రొమాంటిక్ సీన్ చూస్తున్నట్లు నావైపే చూస్తున్నాయి. నేనా చూపుల్ని భరించలేక చేతిలోవున్న కాగితాల్ని టేబిల్ మీద పెట్టి 'కాస్త అవి వన్ ప్లస్ వన్ టైప్‌చేసి పెట్టండి, అర్జంటు' అంటూ రాబోయేసరికి 'ఆగండి' అన్న స్వరం విన్పించింది.

'ఆఫీసు కాగితాలా? లేక పర్సనల్ పేపర్సా?' అని అడిగింది నాగమణి ఎడమ చేత్తో బాగా అలసిపోయినదానిలా కర్చీఫ్ తుడ్చుకుంటూ.

'మా తమ్ముడి అప్లికేషన్ లెండి' అన్నాను ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

'అయితే తీసుకెళ్ళి రేపు తెచ్చుకోండి' అంది టైపుమిషన్ వైపు చూస్తూ.

ఆ మాట విని నిశ్చేష్టుడనయ్యాను! కలా? నిజమా? వైష్ణవ మాయా? ఏమీ తెలియని అయోమయంలో పడ్డాను.

'ప్పే పోస్టు చేయాలి!' అన్నాను.

'ఆఫీసరుగారు అర్జంటు కాగితాలిచ్చారు! అంత అర్జంటయితే టౌన్లో టైప్ ఇన్‌స్టిట్యూట్‌లు చాలా వున్నాయి' అని నవలలో తల దూర్చింది. అదో పెద్ద జోక్‌గా తీసుకుని మన దద్దమ్మలంతా హాలు దద్దరిల్లేలా నవ్వారు. నాకు ఒళ్ళు మండిపోయింది. ఆ సమయానికి కాళ్ళకు చెప్పులు లేకపోయినాయికాని, లేకపోతే దాని పళ్ళు రాలగొట్టేవాణ్ణి! ఆఫీసులో ఆడదానిమీద చేయిచేసుకోవటం నభ్యతకాదని సంశయించాను.' అని కథ ముగించాడు వాసు.

'అవమానం సంగతి ఎలావున్నా, నీ రన్నింగ్ కామెంటరీ బాగుందిరా! అసలు ఆఫ్టరాల్ అర్ధ రూపాయికి ఆశించి ఆడదాని దగ్గర ఆబ్లిగేషన్స్ ఎందుకోయ్ నీకు?'

'ఏడ్చినట్లుంది నీ ప్రశ్న! అసలే ఎన్. జి. వో. గాళ్ళం! గవర్నమెంటు ఇచ్చే జీతం కాంపౌండు ఇంటరెస్టులు కట్టడానికే చాలకపోతుంటే, ఉన్న సౌకర్యాలు కూడా వృధా చేసుకోమంటావా? మన మెంత? మన జీతమెంత? అయినా అసలుదానికి అంత ధైర్యం ఎలా వచ్చినదంట? ఆనాడు అరిటాకని అరిచేతిమందాన అక్షరాలు టేబిల్‌మీద చెక్కినా ఆఫీసరుతో చెప్పలేని పిరికిదానికింత ధైర్యం ఎలా వచ్చింది?'

వాసుగాడి ఆర్గ్యుమెంట్లో అసత్యం లేదనిపించింది. 'అరిటాకు' అన్నది వాసుగాడు నాగమణికి ప్రసాదించిన నాజూకైన బిరుదు. అసలా బిరుదు ప్రదానం చేయటానికి ప్రధాన కారణం వేరేవుంది. నాగమణికి సాహిత్యంలో ప్రవేశమున్న సంగతి వాసు చెప్పేవరకు నాక్కూడా తెలీదు. ఇప్పుడు ప్రతి పత్రికలోకూడా స్త్రీల సమస్యలంటూ కొన్నిఏర్పడి ముందుపేజీల సమస్యలను ఆ తర్వాత మగవారి సమస్యలను పెంచుతున్నమాట అందరికీ విదితమే. ఏదో ఓ మారు మూల పత్రికలలో స్త్రీల సమస్యలగురించి వివరిస్తూ వో వ్యాసం రాసిందట నాగమణి. ఆ వ్యాసానికి 'అరిటాకులాంటి ఆడది' అని టైటిల్ పెట్టిందట. ఇంకేముంది? ఆ వ్యాసం మన వాసుగాడి ఎక్స్‌రే కళ్ళకు కన్పడటమే తడవుగా ఆఫీసుకు తీసుకొచ్చి అందరికీ చూపించి చివరకు ఆఫీసరుక్కూడా చూపించి అల్లరిచేశాడు. ఆఫీసరు సీట్లోలేని సమయంచూసి డిపార్టుమెంట్లో స్టాఫంతా ఒకరితర్వాత ఒకరు వెళ్ళి నాగమణిని దర్శించి కంగ్రామ్యులేషన్స్ చెప్పారు. స్టాఫంతా లంచ్‌కు వెళ్ళినపుడు ఆఫీసరుకూడా ఆ అమ్మాయికి కంగ్రాచ్యులేషన్స్ చెప్పాడట లెండి. చూపులకు ముసలాడైనా ఆఫీసరుగారికి సాహిత్య వేత్తలంటే తగని ప్రీతి. కారణం ఆయనకూడా ఎప్పుడో వయస్సులో వున్నప్పుడు పది ప్రేమకథలు పత్రికకు పంపాడట! అవి ఇప్పటికీ తిరిగి రాకపోయేసరికి ఎప్పటికైనా పత్రికలవారు ప్రచు

1970 లో మీ అదృష్టము

మీరు ఒక పోస్టు కార్డు మీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు సంవత్సరములో జరుగు



ముఖ్య సంఘటనలు అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, సర్వీసులో ప్రమోషన్ ట్రాన్స్ఫర్, పిల్లల జననం, వివాహం, ముఖ్య సంతోషాలు మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజి అదనం. ఒకదఫా మాచిన్నదిపంపగలరు.

PT. DEV DUTT SHASTRI
RAJ JYOTISHI (WAPM)
P.B. 86, JULLUNDUR CITY.



మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

DOL-327 TEL



మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు


# ఈ కథ ప్రచురించవద్దు!

రిస్టారేమో నన్న ఆశ ఇంకా ఆయనలో మిగిలిపోయింది. ఇక్కడ ఇంతకుమించి ఆయన సాహిత్య సేవగురించి చెప్పటం సమంజసంగా వుండదేమో! ఇక అసలు విషయానికి వస్తే వాసుచేసిన పబ్లిసిటీకి నాగమణి ఆనందించే వుంటుంది. 'నీకు ఎంతో ఋణపడి వున్నాను' అని మనస్సులోనే వాసుగాడికి థాంక్స్ చెప్పుకుని వుంటుంది. కాని ఆ మధ్యాహ్నం అనుకోకుండా ఆమెకో ఆపద కల్పించాడు వాసు.

'ఈ శుభ సందర్భంలో సెక్షన్లో అందరికీ కాఫీలు పోయించాలండీ!' అందరూ ఆ అభిప్రాయాన్ని ఆమోదించి బలపర్చారు. నాగమణి తెలివిగా తప్పించుకోవా లనుకుంది. 'ఆఁ ... దీని దేమున్నదండి! మైనర్ థింగ్! చిన్న వ్యాసం'

'నో, నో, మిస్. నాగమణి! మిస్టర్ వాసు కోరినది కరక్టే' అని ఆఫీసరు ఆర్డర్ జారీ చేసేసరికి నాగమణికి నెత్తిమీద పిడుగుపడ్డట్లయింది.

'వెలాఖరు కదా!' అని నసిగింది ఆఫీసరుకు వినబడకుండా. ఆమె ముఖంలో క్రమంగా రంగులుమారాయి. వాసుగాడు బయటకెళ్ళి మరో పావుగంటలో ఓపాతిక జీడిపప్పు పాకెట్లు, పాతిక కాఫీలతో సహా హాజరయ్యాడు. అందరితో పాటు నాగమణికూడా ఆశ్చర్యపోయింది. తనే ఇనిషియేటివ్ తీసుకుని అందరికీ సర్వ్ చేసి చివరకు బిల్ తెచ్చి 'మీ దగ్గరడబ్బు లేదన్న విషయం గమనించి మన క్యాషియర్ కామేశం దగ్గర అప్పుతీసుకుని అరేంజ్ చేశాను ?' అంటూ ఆమెటేబిల్ మీద పెట్టేసరికి నాగమణి ముఖం మాడిపోయింది. కొత్త హీరోయిన్ను తను తీస్తున్నకొత్తపిక్చర్లో బుక్ చేస్తానని ఫోన్ చేసి పిలిపించి, పాత హీరోయిన్నే కొన్ని అనివార్య కారణాంచేత బుక్ చేయాల్సి వచ్చిందని వాపోతున్న నిర్మాతను చూసిన కొత్త హీరోయిన్లా చూసింది నాగమణి వాసువైపు. వస్తున్నకోపాన్ని దిగమ్రింగుకుంటూ, 'నేను పార్టీ తర్వాత యిస్తానంటే తొందరపడ్డా రెందుకు?' అనిఅడిగేసరికి ఈవేళ యిస్తేనే యింపుగా వుంటుందని అరేంజ్ చేశానండి!' అని తన సీటులోకిపోయి కూర్చున్నాడు వాసు.

'ఎప్పటికైనా తప్పదు కదండీ!' అని గుర్తుచేశాడు ప్రక్కసీటులోవున్న ప్రభాకరం. రుసరుస లాడుతూ వాసుగాడి మీదున్న కోపాన్ని, కసిని ఆ పూటల్లా పోల్డామిషన్మీద చూపించింది నాగమణి.

'ఏమిట్రా ఆలోచిస్తున్నావ్?' అని వాసు అడిగేసరికి, వాస్తవంలోకి వచ్చాను.

'మళ్ళీ ఏదైనా కథలగురించి ఆలోచిస్తున్నావా? అన్నట్లు, ఒరేయ్! ఒక సహాయంచేసి పెట్టకూడదూ? ఆ నాగమణిని ఒక వాంప్గా సృష్టించి ఓకథ రాసి పారేయకూడదూ? అప్పుడు నాకసి తీరిపోతుంది. ప్లీజ్! ఈపూటనే రాయి గురూ! నీకేం కావాలోచెప్పు! ఫ్లాస్కులో చాయ్పోయించుకు రమ్మంటావా? నో ప్యాక్ గోల్డ్ఫ్లాక్ తెమ్మంటావా? నోదస్తా కాగితాలు తెచ్చిపెట్టనా?' గుక్క తిప్పుకోకుండా అడిగేస్తున్న వాసునుచూస్తే నాకు నవ్వాగలేదు.

ఉద్యమానికి పోయింత్రానికి ఎంత తేడా? మనిషి నిజంగా ఎంతటి స్వార్థపరుడో ఎంతటి అవకాశవాదో వాసు ప్రత్యక్షంగా నిరూపించాడు. ప్రొద్దున్న వాసు వచ్చేసరికి తను పోస్టులో ముందురోజున తిరిగొచ్చిన కథను పరిశీలిస్తున్నాడు. వాడు వచ్చీ రావడంతోటే తిరిగొచ్చిన కథను చూసి హేళన చేస్తూ, 'ఏం నాయనా? నీకు తిరిగొచ్చిన కథలకు సీరియల్ నంబరు వేస్తున్నావా? దీని నెంబరెంత?' అని అడిగాడు.

'ఏడిశావు లేరా? నీలాంటి చేతగాని వాళ్ళంతా అలానే ఏడుస్తారు?' అన్నాను. నేను కసిలో నిరుత్సాహంగా కథను పెడతా.

'నిజంగానే ఏడ్వాల్సి వస్తుందేమోరా! నీగురించి నీకు తిరిగొస్తున్న కథల గురించి మీ పోస్ట్మాన్ డాన్స్ టాం టాం చేస్తున్నాడు.'

వాడి వాడిమాటలు బాధను కల్గించాయి. పోస్ట్మాన్ చేతిలో తనంత మలకన్నా పోయినందుకు విచారమేసింది. ప్రచురణ కాకపోయినా కనీసం తిరిగి వస్తున్నందుకు సంతోషిస్తే ఇదా ప్రతి

ఫలం?

'అందుకనే ఎందుకొచ్చిన గొడవగని, హాయిగా ఆ కథలు రాయటం మానేసి మన డిపార్టుమెంట్ అకౌంటెంట్ టెస్టులు కట్టుకో! ప్రమోషనయినా వస్తుంది నాలుగ్రాళ్ళు సంపాదించుకో వచ్చు' అన్నాడు. వాడిమాటలు నాకు చిరాకన్పించి 'నీకెంతసేపు తిండి, డబ్బు తప్ప వేరే ధ్యాసలేదు. కథా రచనంటే కూర్చుని కాజాలు తినటమను కున్నావా? ఎంత అనుభవంకావాలో ఎంత విజ్ఞానం వుండాలో నీకేం తెలుస్తుంది? ఒక్కసారే పెద్దరచయిత అయిపోవాలంటే ఇదేమైనా మంత్రి పదవిలాంటి దనుకున్నావా, వోట్లు కొనుక్కొని పేరు సంపాదించటానికి? పెద్ద పెద్ద రచయితలమని చెప్పుకుంటూ కాలరెగ్గెత్తుకుని రోడ్లవెంట తిరుగుతున్నవారంతా నాలాగానే పాట్లుపడినవాళ్ళే!' అని నాలుగ్గు మాటలు దులిపేసరికి వాసు మాట్లాడలేకపోయాడు.

చివరకు 'ఏమోరా! అనవసరంగా బోలెడు టైము వేస్టు చేస్తున్నావని పిస్తుంది. వృధాగా సి. యల్. పెట్టి మరీ రాస్తున్నావ్ కథలు' అని విచారించాడు.

'ఇలాంటి సి. యల్స్ పోతేపోయాయి. ఈరోజు ముచ్చటైన మూడు మంచి కథలు రాయటానికి పూనుకున్నాను. రేపు దీపావళి రిజల్ట్సు రానివ్వవోయి, చూద్దువు గాని మన తడాఖా!' అన్నాను. రచయితకు అహంకారం, గర్వం పనికిరావని తెల్సినా వాడిముందు అలా అనాలన్పించింది.

'అసలు విషయం చెప్పటం మర్చాను పత్రికలో మొదటి ప్రయిజు బందర్లో వచ్చినదట.'

పత్రికలో ప్రయిజు తథ్యం అన్న ధీమాతోవున్న నాకు నిరాశ ఎదురైంది. అందరూ అంటుంటారు 'విజయవాడ రచయితలకు ప్రసిద్ధి' అని విజయవాడలో పుట్టి అక్కడే కథారచన అలవర్చుకున్నందుకైనా అదృష్టదేవత కరుణిస్తుందనుకున్నాను తను.

'పోన్లే! ఇంకా రెండు ప్రయిజులున్నాయిగా!' అన్నాను నవ్వును తెచ్చిపెట్టుకుంటూ.

'నీకూడా ఈ వారంలోపు తెలుస్తుందట! ఇపుడు ఏకంగా బ్యాంకు చెక్కులే పంపిస్తున్నారట.'

తన ముఖంలో చోటుచేసుకున్న నిరాశ, నిర్లిప్తతను గ్రహించిన వాసు 'ఆ కథలు రాయటమెందుకు? ప్రయిజు రానందుకు అలా దిగులుపడి కూర్చోవటమెందుకు? నామాట విని ఆకథలు మానేసెయ్' అని మెల్లగా మందలించాడు.

...వాసు పొద్దున్నచేసిన బోధకు ఇప్పుడుచేస్తున్న అభ్యర్థనకు ఎంత తేడా? ఉత్తరానికి దక్షిణానికి వున్నంత దూరంవుంది. ఆమాటే వాసుదగ్గర అనేసరికి 'నీవలా ఆశ్చర్యపోవటంలో అర్థం లేదు గురూ! నిన్నటివాకా అరిటాకని ఏడిపిస్తుంటే తలవంచుకుని కిక్కురుమనకుండా తన పనిలో తాను నిమగ్నమయ్యే నాగమణి నేడు తలెత్తి సూటిగా నాకళ్ళల్లోకి చూస్తూ నామాటకు ఎదురు చెప్తుందా? ఇదిమాత్రం అనుకోని మార్పు కాదూ? ఏ క్షణానికి ఎటువంటిమార్పులు వస్తాయో మనకే తెలీదు' అని వేదాంతం మొదలుపెట్టాడు.

'అయిందేదో అయిపోయింది! ముందు ఆ అప్లికేషన్ బజార్లో టైప్ చేయించి ఇంటికిపోయి స్నానం చేసిరా! రేపు ఆలోచిద్దాం, నాగమణి గర్వభంగం విషయం' అని నేను అనేసరికి వాసుముఖాన్ని గంభీరంగా మార్చేసి 'నేనంత అసమర్థుడననుకున్నావా? అప్లికేషన్ ఆఫీసులోనే పెట్టి వచ్చాను. రేపు స్వయంగా నాగమణి స్వహస్తాలతో అది టైప్ చేయించకపోతే నా పేరు మార్చుకుంటాను' అన్నాడు సన్నగా పెంచుకుంటున్న మీసంమీద చేయివేస్తూ.

'ఏడ్చినట్లుంది నీ ప్రతిజ్ఞ! అనవసరంగా ఆ అమ్మాయితో అల్లరిపడకు!'

'రేపు చూస్తావుగా నా తడాఖా! వస్తా! గుడ్ ఈవినింగ్' అంటూ వెళ్ళిపోయాడు వాసు.

వాసు వెళ్ళిన దిక్కే కొన్ని క్షణాలు చూస్తూ నిల్చుండిపోయాను.

మరో అరగంటలో స్నానాదులు ముగించుకుని బజారు వెళ్ళి భోంచేసి వచ్చాను. వచ్చేటప్పుడు వో దస్తా కాగితాలు, వో ఇంక్ బాటిల్ తెచ్చుకున్నాను. తెల్లవారేసరికి మూడు కథలూ పూర్తి చేసి మూడు పత్రికలకు పంపించాలన్న పట్టుదల నానుండి ఇంకా సడలలేదు. అప్పటికే రెండు కథలు పూర్తి కావటం చేత మూడో కథను గురించి ఆలోచించ



దిగాలు: ఏమిటో, వాసుగాడు వచ్చి వెళ్ళిన క్షణంనుంచి నా మూడ్స్ మారిపోయాయి. ఎంత ఆలోచించినా అందమైన థీమ్ అంతు చిక్కటంలేదు.

మెల్లగా టేబిల్ లైటు ఆర్పేసి మంచమ్మీద పండుకుని జీరోవాల్ట్ గుడ్డి వెలుతుర్లో పైన తిరుగుతున్న సీలింగ్ ఫాన్ వైపు చూస్తూండిపోయాను.

ఎన్నివిధాల కథారచన సాగించినప్పటికీ పత్రికలవారికి నచ్చకపోవటానికి కారణం నా దురదృష్టమా? లేక రచనా లోపమా? — అని ఆత్మ విమర్శన చేసుకున్నాను. నేను వ్రాసిన కథలు నా ఆత్మకు పూర్తిగా తృప్తినివ్వటమే కాకుండా తోటి స్నేహితులైన ప్రభాకరం, కమలాకరం, వాసు, దాసు వగైరాలకు కూడా నచ్చాయి. రోజు రోజుకు పెరిగిపోతున్న రచయితల మధ్య పేరు సంపాదించటం సుళువుకాదు. పోటీ కథల్లో ప్రయిజు వస్తే మంచి పేరు రావటానికి అవకాశం ఎక్కువనే ఉద్దేశ్యంతో అహోరాత్రాలు ఆలోచించి అరడజను కథలు పంపించాను. కాని వాటి రిజల్టు కూడా తనకు నిరాశను కల్గిస్తున్నాయి. ఇంకో రెండు ప్రయిజులున్నాయన్న సంగతి గుర్తుకురాగానే దూరంగా ఏదో ఆశ తళుక్కున మెరిసింది. ఈ వారంలోపు పోస్టుమాన్ దగ్గర్నుంచి రిజల్టు అందుకోలేకపోతానా, అని గుండెకు ధైర్యం చెప్పాను. ఈసారి పంపించిన కథలను సాధ్యమైనంతవరకు సహజత్వానికి సమీపంగా సృష్టించాడు తను! కనుక ప్రయిజు వస్తుందనే ఆశ హృదయాన్ని విడిచి పెట్టలేకుంది. నా కథల్లోని నిత్యజీవితంలో తారసపడే పాత్రలు సజీవంగా కన్పిస్తాయని కామెంట్ చేశాడు కామేశం. ఆ సంగతి మాత్రం అక్షరాల నిజం!' అని వాసుగాడు కూడా సర్టిఫై చేసేవాడు. నా మీద, నా కథా రచన మీద నమ్మకం ఏర్పడటం మూలంగానే కదా, నేడు నాగమణి మీద నూతన కథా రచనను చేయమని ప్రాధేయపడ్డాడు! నిజమే! నా ఈ మూడో కథలో నాగమణికి ఓ పాత్ర ఇస్తే బాగుంటుందేమో! ఆ రకంగా చేస్తే వాసుగాడి కసి కూడా తీరిపోతుంది. కాని మరుక్షణమే నాగమణి పెళ్ళికాని పిల్లని, మా ఆఫీసులోనే పని చేసే అమ్మాయిని గుర్తుకు రాగానే ఆమె మీద కథ రాయటం భావ్యంగా తోచలేదు. ప్రతిరోజూ ఒకరి ముఖం ఒకరు చూసుకోవాల్సిన అగత్యం వుంది కనుక ఆ అభిప్రాయాన్ని అవతలకు నెట్టాను. నాగమణిమీద కథ కల్పిస్తే సహజత్వం అడుగడుగునా ప్రతిబింబిస్తుందనటం అసత్యం కాదు. అయినా ఆ ప్రయత్నం అసభ్యకరంగా వుంటుందని నా మనస్సు పదేపదే హెచ్చరించింది. పోనీ నాగమణినే దృష్టిలో పెట్టుకుని ఆమె ఆకారాన్ని వర్ణిస్తూ వ్రాస్తే బాగుంటుందేమో! ఆమె గుణగణాల సంగతి ఎలావున్నా, ఆమె ప్రవర్తన చేష్టలు వాసుగాడికి నొప్పి కల్గించినా ఒకటి మాత్రం నిజం! అదేమిటంటే, ఆమె నవ్వు ఎంతటి వాడినైనా కట్టేస్తుంది. పల్చటి పెదాలమధ్య దాక్కున్న తెల్లటి అందమైన పలువరుస మరింత ఆకర్షణీయమై ఆమె వదనానికి వన్నె తెస్తుంది. అటువంటి చిరునవ్వును చిందించే ముఖాలు కల్గిన యువతులు నాకు తటస్థపడిన వారిలో నాగమణి రెండోది. అదేనవ్వు ... అదేకళ ... అదే చూపు...తను ఈ ఉద్యోగానికి రాకపూర్వం తను వూళ్ళో ఎప్పుడూ చూసేవాడు. ఆ అందాలరాణి మరెవ్వరో కాదు, తమ వీధిలో వున్న కరణం గారమ్మాయి కమల!

నా ఆలోచనలన్నీ నాగమణినివీడి కమల మీదికి మళ్ళాయి.

కమలను తల్చుకోగానే నా మనస్సులో ఓరకమైన కసి ఏర్పడింది. బహుశా వాసుగాడుకూడా ఇటువంటి అనుభూతికే గురయ్యాడేమో!

కమలకు నాతో స్నేహం చేయాలనే వుద్దేశం మనస్సులో లేపోయినప్పటికీ, కలవక తప్పలేదు! కారణం ఆమె విద్యాభ్యాసమే! మా వూరినుంచి హైస్కూలు మైలున్నర దూరానవుంది. మా వూళ్ళో ఆ సంవత్సరం హైస్కూల్లో జాయిన్ అయిన వాళ్ళం మేమిద్దరమే! హైస్కూల్కు వెళ్ళేదారి భీకరమైన చెట్లగుంపుల్లోంచి, పొలాల గట్లమీద నుంచి వుండటంచేత ఒంటరిగా వెళ్ళటం కొంచెం భయంగానే వుండేది. అందులో ఆడపిల్లసంగతి అసలు చెప్పక్కర్లేదు. కరణంగారికి నేనంటే ఎనలేని అభిమానం. ఆ అభిమానమే వాళ్ళమ్మాయికి బాడీగార్డులా నన్ను నియమింపజేసే చనువును కల్గించిందాయనకు. కమలకు మనస్సులో ఇష్టం లేకపోయినా తండ్రి ఆనతి ననుసరించి నా ప్రక్కనే నడవాల్సి వచ్చేది. అప్పట్లో కమలను ఒక స్నేహితురాలినిగానే భావించాను తప్ప వేరే అభిప్రాయాలేవీ ఏర్పరచుకోలేదు.

ఇద్దరికీ ఒకేసారి హైస్కూల్చదువు పూర్తయింది. తిరిగి ఇద్దరం ఒకే కాలేజీలో చేరే అవకాశంమాత్రం కల్గలేదు. ఆమె లేడీస్ కాలేజీలో చేరి హాస్టల్లోనే వుండేది. రోజులు గడుస్తున్న కొద్దీ చదువు ధ్యాసలోపడి ఆమెతో పరిచయం సన్నగిల్లసాగింది. నేను ఆమె హాస్టల్కు క్కూడా వెళ్ళేవాణ్ణి కాదు, అప్పుడప్పుడూ పలకరించటానికి. కాని ఒకనాడు ఆమె నాకు హఠాత్తుగా గవర్నరుపేటసెంటర్లో వేరే ఒక అపరిచిత వ్యక్తితో రిక్షాలో వెళ్ళటం చూసేసరికి నాకు క్షణకాలం మతి చలించింది. చేతిలో సైకిలుండటం చేత వెంటనే వారికి కన్పడకుండా రిక్షాను వెంబడించాను. రిక్షా సరాసరి సౌరంగ్ టాకీస్ ముందు ఆగింది. ఆ తర్వాత ఆ వ్యక్తిగురించి ఆరా తీయగా పాలిటెక్నిక్ స్టూడెంటని తేలింది. వారిద్దరి మధ్య స్నేహంతోపాటు షికార్లుకూడా పెరిగి ఫస్టుక్లాసు స్టూడెంటయిన కమలను థర్డ్క్లాసు స్టూడెంటుగా మార్చివేసినందుకు బాధపడి ఓసారి వాళ్ళ హాస్టల్కు వెళ్ళాను. ఆ రోజు వాళ్ళ రూమ్మేట్సు లేకపోవటంచేత ఆమెను మందలించటానికి నాకు చక్కని అవకాశం చిక్కింది. ఆ వ్యక్తితో స్నేహాన్ని ఇకనైనా తుదచేసుకోమని, అది లేనిపోని సమస్యలను సృష్టించవచ్చని, అనవసరంగా అల్లరికావద్దని హెచ్చరించాను. నేను ఎన్ని మాటలన్నా మారు మాట్లాడక పోవటం గ్రహించి ఆమెలో మార్పు వచ్చిందని ఆనందించాను. కాని మూడోనాడు మళ్ళీ ఆ వ్యక్తితోనే నా ముందుగానే గాంధీ హిల్మీదికి వెళ్ళింది. నేనిక కోపాన్ని భరించలేక ఆ మర్నాడే వాళ్ళ

హాస్టల్‌కు వెళ్ళాను. అప్పటికే చుట్టు ప్రక్కల ఆడవాళ్ళు వుండటంచేత ఆమెను అంతమందిలో చివాట్లు వేయటం మంచిది కాదనుకుని 'కొంచెం మాట్లాడాలి బయటకు రమ్మని' అడిగాను. కాని వెంటనే కమల ఏమీ తెలియని అమాయకురాలిలా ముఖంపెట్టి, 'క్షమించండి! మీ రెవ్వరో నాకు తెలీదు!' అంది.

ఆ మాటలు నాకు విపరీతమైన ఆశ్చర్యాన్ని కల్గించాయి. చుట్టూ వున్న విద్యార్థినులంతా నా వైపే చూస్తున్నారు.

'కమలా? ఏమిటీ నాటకం? నే నెవరో నిజంగా నీకు తెలీదా?' అని సూటిగా అడిగాను.

'నాటకమాడేది ఎవరు? మీరా? నేనా? ఆడపిల్లను అల్లరి చేయాలనుకుంటున్నారా? వార్డెన్‌గారికి రిపోర్టు యిస్తా జాగ్రత్త!' అని అనేసరికి—

'ఏమైందే?' అంటూ మిగిలిన విద్యార్థినులంతా నన్ను చుట్టుముట్టబోయే సమయానికి నేను మెల్లగా బయటకు వచ్చేశాను. ఆ సమయంలో అక్కడవుంటే అవమానంతోపాటు ఆడపిల్లలచేత సన్మానం కూడా జరిగేదే! కారణం, ఈ లోకానికి చెవులేకాని కళ్ళు లేకపోవటమే! అందులో ఆడది అబద్ధం చెప్పినా అతికినట్లుంటుంది కాబట్టి, ఈ లోకం ఆసక్తితో ఆలకిస్తుంది. అంతటితో ఆగలేదు ఆ అబల! నేను జరిగిన విషయాల్ని కరణంగారికి చెప్తానని ఊహించి ముందే జాగ్రత్తపడింది. ఫలితంగా నేను కరణంగారింటికి వెళ్తే, 'నీ విలాంటివాడి వనుకోలేదయ్యా! ఎంతో బుద్ధిమంతుడవనుకున్నా! రేపో మాపో డిగ్రీ తీసుకోబోతున్నావ్! నీకు జ్ఞానం వుండక్కర్లా? పట్నంలో చెడుసహవాసాలు పట్టి పాడవుతావనుకోలేదు.' అన్న కరణంగారి మాటలు నా కాళ్ళకు బంధాలువేసి వారి వీధి గుమ్మంలోనే నిలబెట్టాయి.

'మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు!' అన్నాను స్పష్టంగా.

'నా కంతా తెలుసోయ్! అమ్మాయి అంతా చెప్పింది నీ వొక పెద్ద రవుడీ వయ్యావని, కన్పించిన ఆడపిల్లనల్లా ఏడ్పిస్తున్నావని, వో పదిమంది రవుడీ వెధవలతో రోడ్ల వెంట తిరుగుతున్నావని ...నీ గురించి అంతా తెల్సుకున్నాను. ఏదో మీ పెద్దల ముఖాలు చూసి వూరుకున్నాను గాని లేకపోతే నీవు చేసిన పనికి రిపోర్టు యిచ్చేవాణ్ణి!' అని అనేసరికి 'నేను చేసిన పని' ఏమిటో అర్థంకాక ఆశ్చర్యంగా ఆయనకేసి చూసేసరికి, పగిలిన కళ్ళద్దాల జోడును సవరించుకుంటూ, 'ఏమిటోయ్? ఏమీ తెలియనివాడిలా చూస్తావ్? పరాయి పిల్లల వెంటపడటమేకాకుండా మా కమలను కూడా ఏడ్పించటానికి ప్రయత్నించావటగ! మొన్న హాస్టల్‌కు వెళ్ళి అల్లరి చేసి మ్యాట్నీలకని, షికార్లకని రమ్మన్నావటగ! ఇదేమైనా సభ్యతగా వుందా? పెళ్ళికాని ఆడపిల్లను అల్లరి చేస్తావా?' నాకు కోపం ఎక్కువైపోయింది. ఆ సమయంలో నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోటానికి ప్రయత్నించటం వ్యర్థమని నాకు తెల్సు! అందుచేత హెచ్చు స్వరంతో—

'కరణంగారూ! కమల కల్పించిన కల్లబొల్లి మాటల్ని నమ్మి నన్ను అవమానించారు. ఎప్పటికైనా నిజాన్ని తెల్సుకుని పశ్చాత్తాపపడక తప్పదు! చేతులు కాలకముందే ఆకులు పట్టుకోటం మంచిది! మీ కమల వ్యవహారాలు కొంచెం కని పెట్టండి. వస్తా!' అంటూ వచ్చేశాను.

ఆ నాటినుండి కమల చేసిన మోసానికి ఆమె మీద కసి ఏ రకంగా తీర్చుకోవాలా, అని ఎదురు చూస్తున్నాను. కాని వేదు వాసుగాడు చెప్పేవరకు నా చేతిలోని విద్య దానికి వినియోగపడుతుందని తెల్సుకోలేకపోయాను. అంతేకాక చదువు పూర్తి కాకముందే దొరికిన ఈ గుమాస్తాగిరి బరిలో పడి బయట పడలేకపోవటంచేత ఆమెను గురించిన ధ్యాస వదిలేశాను. అయితే బ్రతుకుతున్నది బెజవాడలోనే కాబట్టి కమల గురించిన వివరాలు నాకు తెలియకపోలేదు. నాకు ఆ రోజు కన్పడిన ఆ అపరిచిత వ్యక్తిని రిజిస్టరు మ్యారేజీ చేసుకోవటానికి కమల ఒప్పుకుందని, అందుకోసమై ఇంట్లోవాళ్ళనందర్నీ ఎదురించే పరిస్థితికి వచ్చిందని నా స్నేహితునిద్వారా తెల్సుకుని ఆశ్చర్యపోయాను. 'బరితెగించిన ఆడది', 'తేనె పూసిన కత్తి' — లాంటి పదాలు ఇలాంటివారికి చక్కగా అమరుతాయనిపించింది. కమల ఎంత ధైర్యం చేసినా అనుకున్న టైమ్ ప్రకారం రిజిస్ట్రార్ ఆఫీసు దగ్గరకు ఆ వ్యక్తి రాకపోయేసరికి ఆమె భీతి చెందినది తెల్సుకుని చాలా విచారించాను. ఈ మధ్య కొత్తగా వచ్చిన వార్తనుబట్టి ఆ అవి



# ఈ కథ ప్రచురించవద్దు!

ఆ వ్యక్తి జాడలు కన్పించటంలేదని, హైద్రాబాద్‌నుండి మాత్రం అడ్రసు యివ్వకుండా కమలకు ఓ ఉత్తరం రాశాడని, త్వరలోనే కల్యాణం చేసుకుంటానని కూడా వ్రాసినట్లు తెల్సింది. అప్పటికే వారి స్నేహం చేయిదాటి పోయినందుకు కరణం దంపతులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారట! కూతురి జీవితం నాశనమై పోయినందుకు కుమిలిపోతూ ఆ వ్యక్తి ఆచూకీ తీయటంకోసం మొన్నిమధ్యనే కరణంగారు హైద్రాబాద్ వెళ్ళారని తెల్సుకుని నేను బాధపడ్డాను. ఆ ముసలి దంపతులమీద నాకు అప్రయత్నంగా కరుణ, జాలి కల్గింది. కాని ఆ కరుణను కమలమీద చూపించలేకపోతున్నాను. కారణం కమల చేస్తున్న ప్రచారమే! తన జీవితం నాశనం కావటానికి ఆ వ్యక్తి దూరం కావటానికి కారణం, తను నల్గురిలో అల్లరి అవటానికి కారణం ప్రసాదే నని పదిమందిలో ప్రచారం చేస్తుందట. అందుచేతనే నాకామెను చూస్తే కరుణ బదులు పగ ఏర్పడింది. ఆమె అందరిలో అనే మాటలు నిజం చేయాలి! ఆమెను అందరిలో అల్లరి చేయాలి! కాని, ఎలా? ఎలా సాధ్యం?...తన మూడో కథ విషయం గుర్తుకు వచ్చింది. ఇంకేముంది?

వెంటనే లేచి లైటు వేశాను!

గబ గబా పెన్ తీసుకుని మూడో కథను మొదలుపెట్టాను!

మనస్సులో కమల గిర్రున తిరుగుతూంది!

కథ కమ్మగా సాగిపోతూంది!

పాత్రల పేర్లు ఉన్నవి వున్నట్లుగా పెట్టేశాను. ఊరు పేర్లు మాత్రం మొదటి సగం మార్చాను. మొత్తంమీదికి మంచి కథ తయారైంది!

పదిపేజీ లొచ్చిన కథను పదే పదే చదువుకున్నాను. కమల చదువుతుంటే తనకథే నన్న భ్రాంతి కల్గేటట్లు వచ్చిన కథకు నాలో నేనే మురిసిపోయాను. కథైతే వ్రాశానుకాని టైటిల్ మాత్రం ఏం పెట్టాలో బోధపడలేదు.

ప్రక్కనున్న ప్లీడర్‌గారి గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. టైటిల్‌కోసం మెదడు పాడుచేసుకోవటం ఇష్టంలేక లైటార్పేసి పక్కమీదవాలాను. బాగా అలసిపున్నానేమో, అనుకోకుండా నిద్రపట్టేసింది.

* * *

'ఒరేయ్ ప్రసాద్! గుడ్‌న్యూస్! నీకేదో రిజిష్టర్ వచ్చినదట! విష్ యు గుడ్‌లక్' అంటూ వాసుగాడు వచ్చేసరికి కంగారుగా చూస్తున్న కాగితాల్ని ఫైలులో కట్టేసి వాడివెనకాలే బయటకు వెళ్ళాను. గుమ్మందగ్గర ఎవరికో మణియార్డర్ యిస్తున్న పోస్టుమాన్ నా కంటికి అదృష్టదేవతలా కన్పించాడు.

'వారేనండి ప్రసాద్‌గారు' నన్ను కొత్త పోస్టుమాన్‌కి పరిచయం చేశాడు.

'మీ కేదో రిజిష్టర్ రీడైరెక్టు చేశారు చూడండి' అన్నాడు నాకో కవరు అందిస్తూ.

మా వూరినుంచి రీడైరెక్టు చేయబడిన ఆ రిజిష్టర్ ఎర్ర గీతతో వికృతంగా తయారైంది. సంతకంచేసి కవరు తీసుకుని చించాను.

'పార్టీ యిప్పించాలి గురూ! తప్పకుండా నీ కథకు సెకండుప్రయిజు వచ్చివుంటుంది!' అని వాసుగాడు లొట్టలు వేస్తున్నాడు.

కవర్లోని కాగితాలు నా హృదయానికి గాయాన్ని కల్గించి, కంటికి కన్నీటిని కల్పించాయి.

'ఏమిట్రా, అలా మారిపోయావ్?' అని వాసుగాడి ప్రశ్నకు సమాధానంగా నా చేతిలోని కాగితాల్ని వాడి చేతిలో పెట్టి, కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ నా సీట్లోకిపోయి కూర్చున్నాను ... ఎదురుగా ఆఫీసరు చూస్తున్నాడు!

కాగితాలు కదపకపోతే ఆయనకు కోపం రావచ్చు! కాని ఫైలుతెరిచినా, మనస్సు పనిచేయటంలేదు. ఏదో ప్రయిజు వచ్చిందని సంతోషపడి అందుకున్న కవరు, నా తండ్రి వుండగా అవతారం దగ్గర చేసిన అప్పుకు అసలు వాయిదాలతో సహా ఆరువందలు దాటిన ఆ ప్పుకు కోర్టువారు యిచ్చిన తాఖీదుగా మారేసరికి మనస్సు మొద్దుబారి పోయింది.

వాసుగాడువచ్చి సానుభూతితో కాగితాలు నా చేతిలో పెట్టేవరకు నాకు అసలు విషయం గుర్తుకు రాలేదు. నేను పత్రికలకిచ్చింది మా అడ్రెస్ ఇంటిఅడ్రస్! 'స్టిల్ దేర్ ఈజ్ హోప్' అనుకుంటూ ఓ గంట పర్మిషన్‌పెట్టి ఆఫీసులోంచి బయటపడ్డాను.

నీరసంగా మెట్లెక్కి, రెండో అంతస్తులోవున్న నా రూముకువేసిన తాళం తీస్తుండగా ప్లీడర్‌గారి పాపవచ్చి 'మీకో రిజిష్టర్ వచ్చినదండి' అంది.

'కొంపతీసి ఇదికూడా ఇంకో కోర్టు నోటీసు కాదుకదా!' అనుకుంటూ ప్లీడర్ గారింటికి వెళ్ళి 'ఏమండీ అక్కయ్యగారూ! నాకేదో రిజిష్టర్ వచ్చిందని పాప చెప్తూంది. నిజమేనా?' అని అడిగాను.

'నిజమేనయ్యా! మద్రాసునుంచి వచ్చినదట! ఏదో పత్రికాఫీసునుంచి వచ్చిందని చెప్తే నీవు పనిచేస్తున్న ఆఫీసు అడ్రస్ చెప్పాను. అయితే ఆఫీసుకు తీసుకు రాలేదన్నమాట!'

'లేదండి! రేపు తీసుకు వస్తాడేమో!' అని గబ గబా నారూమ్‌లోకి వెళ్ళాను. హెడ్ పోస్టాఫీసుకు మారూమ్ దగ్గరే నన్న సంగతి గుర్తుకురాగానే, పోస్టాఫీసుకు ప్రయాణమయ్యాను.

అదృష్టవశాత్తూ పోస్టుమాన్ కన్పించాడు. అతను ఇచ్చిన రిజిష్టర్‌ను సంతకంచేసి తీసుకుని విప్పేసరికి నా కళ్ళు ఆనందంతో మెరిశాయి. నా మనస్సు సంతోషంతో గంతులు వేసింది. పత్రికలో నాకు సెకండ్ ప్రయిజు. ఆ మొత్తానికి చెక్కు పంపించారు. అంతే కాదు? నేను పంపిన కమల కథ... కాదు...కాదు...'అబల' అనే కథకూడా ప్రచురణకు అంగీకరించారట! కథపంపి నాలుగ్రోజులు కాకపోయినా వేసుకుంటున్నట్లు తెలియపర్చారు. ఎంత ఆశ్చర్యం! కాదు...కాదు...అదృష్టం!

ఆ శుభవార్త అందరికీ తెలియపర్చటం, బ్యాంకులో చెక్కు మార్చుకోవటం, డిపార్టుమెంటంతా పార్టీ యివ్వటం, నల్గురూచేరి సన్మానసభ ఏర్పాటుచేయటం సినిమా రీళ్ళలా గిర్రున తిరిగాయి.

ఒక శుభక్షణాన 'అబల' కథ అచ్చయింది!

రెండో రోజున మిత్రులంతా తన వివాహాన్ని పావనంచేసి తానిచ్చిన తేనీటి గందును స్వీకరించి వెళ్ళారు. కానివాసు గాడు మాత్రం పార్టీకి రాకపోవటం నాకు ఆశ్చర్యాన్ని కల్గించింది. వాడికోసం ఎదురు చూసేసరికి, మా వూరినుంచి మా పెద్దమ్మగారబ్బాయి ప్రేమకుమార్ ఎదురయ్యాడు. నన్ను చూడగానే బావురుమంటూ ఏడుస్తూ, 'ఏమైపని జరిగిందన్నయ్యా! నీవు కమలమీద కథ రాశావటగా! అది చదివి నూతిలో పడిందట! నీవు త్వరగా బయల్దేరు!'

నాకు తల తిరిగిపోయింది!

ఎక్కడ సామాన్లు అక్కడే వదిలేసి రూమ్‌కి తాళంవేసి ప్రేమ్ కుమార్‌ను అనుసరించాను.

రోడ్డుమీదికి వచ్చేసరికి వాసు ఎదురయ్యాడు. నన్ను చూడగనే, 'ఆలస్యమైనందుకు సారీ బ్రదర్! నీ కథపడిన సమయంలో నీకో ప్రజెంటు' అంటూ ఏదో ప్యాకెట్ను ఇవ్వబోయే సరికి కంగారుగా వున్న నేను 'అవన్నీ తర్వాత మాద్దాం! పడింది కథకాదు...కమల...' అన్నాను.

'కమలేమిటీ ?' అన్నాడు అర్థంకాక.

'కమల నూతిలోపడింది' అని మారు పల్కకుండా ప్రేమకుమార్ ఏర్పాటుచేసిన టిక్సీలో ఎక్కిపోనిమన్నాను.

బస్సులో ఎక్కినన్న మాటేకాని నా మనస్సంతా ఆలోచనలతో నిండిపోయింది. మావూరు అక్కడికి వుండటానికి పన్నెండుమైళ్లే అయినా ఎన్నోమైళ్లు ప్రయాణం చేస్తున్నట్లనిపించింది.

ఊళ్ళోకి వెళ్ళగానే కరణంగారింటికి పరిగెత్తాము. దొడ్డిదారిగుండా వెళ్ళటంచేత నా రాకను ఎక్కువమంది గమనించలేక పోయారు. నూతిలోపడిన కమలను బయటకు తీశారు. ఆడవాళ్ళ ఏడ్పులు... మగవాళ్ళ మాటలు...వాతావరణం అంతా కంగారుగా వుంది,

'తన కథంతా రాసి అందరిలో అల్లరిచేశాడని భావించి అవమానాన్ని భరించలేక ఆత్మహత్యకు దిగింది పాపం' స్కూల్ మాష్టారు పాముభూతి.

'ఆ నచ్చినోడు రాసినకథ అమ్మాయి ప్రాణాన్నే బలికోరిందే!' ఓ ముసలమ్మ శాపనార్థం.

'పోనీ! పేర్లుమార్చి ఏదో రకంగా వ్రాయకపోయాడా? ఉన్నవి వున్నట్లుగానే రాయాలా?' అవూరి కొత్త అల్లుడి కామెంట్.

'పనిపాట లేకపోతేసరి కథలు రాస్తామంటూ బయల్దేరుతారు! కూడు పెడతాయా? గుడ్డ పెడతాయా? ప్రాణాలు తీస్తున్నాయి కదా?' వో రాజకీయవేత్త వ్యాఖ్యానం.

'వాణ్ణి వస్తే మక్కెలిరగ్గొట్టాలి!' వో కొంటె వెధవ ఛాలెంజ్.

'ఏమిటది? ఎవడో వేలుపెట్టి నన్ను చూపిస్తున్నాడు! అందరూ నావైపే వస్తున్నారు. ఇక ఇక్కడుండ కూడదు! పారిపోవాలి! అరె! కాళ్ళు ముందుకు పడటంలేదు! అయ్యయ్యో! అందరూ నన్నుచుట్టు ముడ్తున్నారు! అయ్యబాబోయ్! చచ్చిపోతున్నాను! రక్షించండి! రక్షించండి!

'ఏమైంది? ఏమైంది?' అంటూ ఎవరో తలుపు బాదుతున్నారు కళ్ళు తెరిచాను!

అప్పుడే కిటికీలోంచి ప్రవేశిస్తున్న ఉదయభానుని కిరణాల వెలుగులో వెలవెలా బోతున్న జీరోవాల్ట్ బల్బు కన్పించింది.

కళ్ళు నులుముకుని చూశాను!

'ఏమిటిదంతా?' అనుకునే లోగానే అక్కయ్యగారి కంఠం విన్పించింది. వెళ్ళి తలుపు తీశాను.

'ఏం నాయనా ప్రసాద్? కలవరిస్తున్నట్లున్నావే?'

'కలవరింతా?' అంటూ ప్రక్కనున్న టేబిల్‌మీదికి చూసేసరికి రాత్రి రాసిన నా 'మూడోకథ' వెక్కిరిస్తూంది!

'అవునక్కయ్యా! ఏదో పీడకల వచ్చింది!' అన్నాను.

'పొద్దెక్కిపోతూంది! త్వరగా ముఖం కడుక్కుని మా ఇంటికిరా! ఈవేళ మా పాప పుట్టినరోజు! కాఫీ టిఫిన్ మాఇంటిదగ్గరే తీసుకుందువుగాని!' అని చెప్పి వెళ్ళిపోయింది.

నా కళ్లకు, మనస్సుకు ఆవహించిన మైకం చెదిరిపోయింది. ఇంతసేపు నేను కనినదంతా కలేనా? పత్రికలో ప్రయిజు పోయినట్లేనా? కాని వెంటనే కమల... ఆత్మహత్య... మనుష్యులు ... గుర్తుకురాగానే రాత్రి జరిగినదంతా నిజం కాకుండా కలకావటమే క్షేమం అన్పించింది.

వెంటనే పేరుపెట్టని ఆ కథను ముక్కలు ముక్కలుగా చింపేసి వరండాలోకివెళ్ళి రోడ్డుమీదున్న మ్యునిసిపాలిటీ చెత్తకుండీలో పడేటట్లు విసిరాను. ●

ముసలాడ్నైపోతున్నగదా! - అప్పుడప్పుడూ నాకు మతి సరిగ్గా వుండం లేదు బావగారూ!

